సాక్షి

అన్నమయ్య జిల్లా

ఆదివారం । 28 । జూలై । 2024



కీచక ఉపాధ్యాయుడు

లక్కిరెడ్డిపల్లి మండలం రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అభ్యకరంగా ప్రవర్తిస్తున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. -8లో



చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్ల దాడి

వైఎస్సార్ జిల్లా పులివెందుల మార్కెట్ యార్డు సమీపంలోని ఒక హోటల్ వద్ద చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్లు దాడి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.420
రెండోరకం	రూ.300	రూ.376

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1106 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు



కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధాతథంగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

'ఇంజినీరింగ్' పుస్తకాలకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్: ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే పేద విద్యార్థులు ఉచితంగా పుస్తకాలు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని గంజికుంట ఫౌండేషన్ కార్యదర్శి గంజికుంట గణేష్ తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. గంజికుంటఫౌండేషన్.సీఓఎం వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9059598222 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

29న బహిరంగవేలం

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా వీరపునాయునపల్లె మండలం కొమ్మద్ది గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వరాయ సాగర్ ప్రాజెక్టులో చేపలు పట్టుకుని అమ్ముకునేందుకు ఈ నెల 29న కొమ్మద్ది గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. అధార్‌కార్డు జిరాక్స్, రూ. 10 వేలు చెల్లించి వేలం పాల్గొనవచ్చని సూచించారు. రిజర్వాయర్ గుత్తపైకం మొత్తం రూ. 2,93,113 నుంచి మొదలవుతుందని తెలిపారు. ఈ వేలం ఈ నెల 1వ తేదీ నుంచి 2015 జూన్ వరకు చేపలు పట్టుకుని అమ్ముకునే హక్కు ఉంటుందని ఆయన చెప్పారు.


దేవుని మాన్యం పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



దేవదాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఉప కమిషనర్ గురుప్రసాద్

రాయచోటి: దేవదాయ ధర్మాదాయ శాఖ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎండోమెంట్ రాయలసీమ జోన్ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్ పేర్కొన్నారు. రాయచోటిలోని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో తనిఖీ అధికారులు, ఈఓలతో ఆలయ భూముల పరిరక్షణపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఎండోమెంట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, మండలాల ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో లీజు చెల్లించని గుత్తేదారుల నుంచి ఎండోమెంట్ స్థలాలు, ఎండోమెంట్ భూములకు శాఖపరమైన సవరణ చట్టం 36/2023 ప్రకారం రక్షణ కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న దేవాలయ భూములకు వేలం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనాల ప్రమాదాలపై అవగాహన కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో, కర్మాగారాల తనిఖీ అధికారులు

రాయచోటి టౌన్: రసాయనాల ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాయచోటి ఆర్‌డీవో రంగస్వామి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన పదార్థాల రవాణా, నిల్వ ఉంచేటప్పుడు, క్రయ, విక్రయాల సమయంలో ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. అలాంటి సందర్భాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ సంఘటనలు జరగకుండా ప్రజలను రక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం జిల్లా ఉప కర్మాగారాల తనిఖీ అధికారి కె.కృష్ణమూర్తి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు కెమికల్ విక్రయ, క్రయదారులతో సమీక్షలు నిర్వహించి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్, ఎక్సైజ్, ఫైర్ స్టేషన్, ఎన్‌జీవో అధికారులు పాల్గొన్నారు.

పట్టం కట్టినా.. ప్రాధాన్యత ఏదీ!

'వినేవారు లోకువైతే చెప్పేవారు చంద్రబాబు' అనే నానుడి ఉంది. విపక్షంలో ఓ మాట.. అధికారంలో మరోమాట మాట్లాడడం ఆయనకే చెల్లు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను చెప్పుకోవచ్చు. అధికారంలో ఉంటే విస్మరించడం.. లేకపోతే ప్రాజెక్టుల సందర్శనంటూ హంగామా చేయడం జిల్లా వాసులకు ఎరుకే. గండికోట ప్రాజెక్టు నిర్మాణానికి 1996, 99 ఎన్నికలకు ముందు రెండుసార్లు శంకుస్థాపన చేయడం మినహా, ఆ ప్రాజెక్టు నిర్మాణం పట్ల చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యమే ప్రదర్శించింది. రాయలసీమలో తమకు ఓట్లు, సీట్లు ఇవ్వరని, అందుకే అభివృద్ధి చేయలేదని నిర్లజ్యగా కూడా ప్రకటించడం గమనార్హం.

- నాటి నుంచి రాయలసీమ ప్రాజెక్టుల పట్ల చంద్రబాబుకు అంతులేని నిర్లక్ష్యం
- జీఎన్ఎస్ఎస్‌కు ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్– వైఎస్ జగన్ ప్రభుత్వాలే
- 2014–19లో చంద్రబాబు సర్కార్ నామమాత్రపు వెచ్చింపు
- గండికోటకు రెండు సార్లు శిలాఫలకాలు వేసిన ఘనత బాబుదే
- సీఎంగా వైఎస్ జగన్ హయాంలో 27 టీఎంసీల నీటితో కళకళలాడిన గండికోట



గండికోట ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి, కడప: నిర్దిష్ట అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నా సాగునీటి ప్రాజెక్టు పట్ల ఇదివరకూ టీడీపీ సర్కార్ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఈమారైనా చిత్తశుద్ధితో సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలు కాంక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 1995–2004, విభజన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 2014–19లో నారా చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులంటే మండిపడేవారు. నిన్నమొన్నటి వరకు 25 టీఎంసీల నిల్వకు కారణమైన గండికోట ప్రాజెక్టును ఉమ్మడి ఏపీలో నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చిన చరిత్రను కూడా చంద్రబాబునాయుడు మూట గట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు చేరాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ఒక్కటే మార్గమని తలచారు. అలా చేస్తేనే కాస్తో, కూస్తో రాయలసీమ ప్రాంతానికి నీరు చేరుతుందని మనస్ఫూర్తిగా నమ్మారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్ సర్కార్ పెంచుతుంటే, తెలుగుదేశం పార్టీ నేత దేవినేని ఉమామహేశ్వరావు ద్వారా అడ్డుకునే ప్రయత్నం కూడా చేపట్టారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతైనా ప్రాంత ఉన్నతికి కృషి చేస్తారంటే ఐదేళ్ల కాలం ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు.

చంద్రబాబు శంకుస్థాపనతో సరి...



గండికోట ప్రాజెక్టుకు 1996 ఫిబ్రవరి 29న ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు శెట్టివారిపల్లె సమీపంలో శంకుస్థాపన చేశారు. తర్వాత వామికొండ వద్ద మరోమారు 1999 ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారు. తర్వాత ఆ ప్రాజెక్టు పట్ల ఏమాత్రం శ్రద్ధాసక్తులు చూపలేదు. మరోవైపు గండికోటను నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చారు. 2004లో అధికారంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చాకే ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టించారు. ఆయన హయాంలో రూ.3213 కోట్లు వెచ్చిస్తే, తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కేవలం రూ.804 కోట్లు మాత్రమే వెచ్చించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) పరిధిలో రూ.4256 కోట్లు వ్యయం చేశారు. మరో రూ.454 కోట్లు నిర్వాసితులకు చెల్లించారు. పైగా 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌కే దక్కిందని పలువురు వివరిస్తున్నారు.

▶▶ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళిక



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం ప్రక్రియను ప్రారంభించి వేగవంతంగా పనులు చేపట్టుతోంది. 12టీఎంసీ నీరు జీఎన్ఎస్ఎస్ ద్వారా లిఫ్ట్ చేసి చిత్తూరు అన్నమయ్య జిల్లాల్లో కరువు నివారణకు శ్రీకారం చుట్టింది. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో జంగందేవరపల్లె వద్ద నీరు కలపడం ద్వారా పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, రాయచోటి నియోజకవర్గాలను సస్యశామలం చేసేందుకు యోగ్యకరంగా మారింది. ఇలాంటి ప్రాజెక్టుల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించి పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత చంద్రబాబు సర్కార్‌పై ఉంది. మరోవైపు జలాశయాలు ఉన్నా, వాటి ఫలాలు క్షేత్రస్థాయిలో దక్కలేదు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. సీఎం చంద్రబాబు కోరినట్లుగా జిల్లాలో సీట్లు, ఓట్లు కూడా లభించాయి. ఈమారైనా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పట్ల చంద్రబాబు సర్కార్ ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అందుకు అధికారపార్టీ ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా మెలగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం చంద్రబాబునాయుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఖర్చు చేసిన వివరాలు (రూ. కోట్లలో)

ప్రాజెక్టు	వైఎస్సార్ హయాం 2014కు ముందు	చంద్రబాబు సర్కార్ 2014-19	వైఎస్ జగన్ సర్కార్ 2019-24
గండికోట	819	413.5	504
సర్వారాయసాగర్	209.48	78.9	212
జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్	405.3	164.9	698.3
సీబీఆర్	601	24.28	250.68
సీబీఆర్ రైట్ కెనాల్	352.8	9.80	55.50
పైడిపాళెం	736.9	113.5	142
గండికోట టన్నల్ విస్తరణ	–	–	250
అవుకు టు గండికోట కెనాల్ విస్తరణ	–	–	500
రాయలసీమ డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టు	–	–	1644

దిగడం సరే.. ఎక్కడమెలా!

- కన్ఫ్యూజ్ హాల్టింగ్ ఆర్డర్స్
- రైల్వే అధికారుల వింత వైఖరిపై విమర్శలు
- ఆందోళనలో ప్రయాణికులు



తిరుమల ఎక్స్‌ప్రెస్‌రైలు

రాజంపేట: ఒక రైలుకు ఒక స్టేషన్‌లో హాల్టింగ్ ఇస్తే.. ఆ రైలు అప్, డౌన్‌లకు హాల్టింగ్ ఉన్నట్లే.. అయితే గుంతకల్లు డీవోఎం(కోచ్) పేరిట విడుదలైన ఉత్తర్వులలో హాల్టింగ్స్ పై వింతవైఖరి శనివారం బట్టబయలైంది. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కన్ఫ్యూజ్ హాల్టింగ్ ఆర్డర్స్ జారీ చేసి ప్రయాణికులను గందరగోళంలోకి నెట్టేశాయి. మోదీ పాలనలో అడ్డగోలుగా అధికారులు తీసుకుంటున్న వింత నిర్ణయాలతో కేంద్రం పేద, మధ్యతరగతి వారి నుంచి చెడ్డపేరు మూటకట్టుకుందనే విమర్శలున్నాయి. ఈ పరిస్థితి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వేపరంగా గుర్తింపు కలిగిన నందలూరు రైల్వేకేంద్రంలో చోటుచేసుకుంది. కడప నుంచి విశాఖకు (17487) తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు నందలూరులో హాల్టింగ్ ఎత్తివేశారు. అయితే విశాఖ నుంచి తిరుపతికి వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు నందలూరులో హాల్టింగ్ ఇచ్చారు. ఎక్కేందుకు వీలులేకుండా, వచ్చేందుకు వీలు కల్పించే హాల్టింగ్ ఇచ్చారు. అలాగే 17415 నంబరుతో నడిపించే తిరుపతి నుంచి కోల్హాపూర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్‌ను ఎత్తివేశారు. అయితే కోల్హాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు నందలూరు హాల్టింగ్‌ను ఇచ్చారు. ఈ విధంగా హాల్టింగ్స్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని రైల్వే వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

ఓబులవారిపల్లె, రాజంపేటలో..

ఓబులవారిపల్లెలో రైల్వే జంక్షన్‌లో నందలూరు రైల్వేకేంద్రం తరహాలోనే 17415 నంబరు గల తిరుపతి -కోల్హాపూర్, తిరుపతి-నిజాముద్దీన్, నిజాముద్దీన్-తిరుపతి మధ్య నడిచే (12793/12794) రైలుకు పూర్తిగా హాల్టింగ్ ఎత్తివేశారు. రాజంపేట రైల్వేస్టేషన్‌లో మధురై నుంచి లోకమాన్యతిలక్ (22102)కు హాల్టింగ్ ఎత్తేశారు. ఎక్కడానికి మాత్రమే హాల్టింగ్, దిగడానికి హాల్టింగ్ లేకుండా చేశారు. రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది కంటి ఆపరేషన్లకు మధురైకు వెళుతుంటారు.

అదే రైల్లో తిరిగి తమ గమ్యాలకు చేరుకుంటున్నారు. వారు రైల్వే అధికారులు తీసుకున్న వింత నిర్ణయాలపై పెదవి విరిస్తున్నారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో కాచిగూడ నుంచి చెంగల్పట్టుకు వెళ్లే (17652)రైలుకు హాల్టింగ్ ఎత్తివేశారు.

నందలూరుపై నిర్లక్ష్య ధోరణి



నందలూరు రైల్వేకేంద్రంపై గుంతకల్లు రైల్వే అధికారుల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. రైళ్ల హాల్టింగ్ విషయంలో అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేబోర్డు, దక్షిణమధ్య రైల్వే అధికారులు సానుకూలంగా ఉన్నా.. గుంతకల్లు అధికారుల తప్పుడు నిర్ణయాలతో నందలూరు నిర్వీర్యమవుతోంది. –షాజహాన్, ముస్లిం నేత, నందలూరు

ఓబులవారిపల్లెపై చిన్నచూపు



ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ విషయంలో గుంతకల్లు రైల్వే అధికారుల చిన్నచూపు కనిపిస్తోంది. హాల్టింగ్ తీసేయడం, పెట్టడం వారి ఇష్టమైపోయింది. రాయలసీమ రైలు హాల్టింగ్ ఎత్తేయడంతో పాటు హరిప్రియ రైలుకు హాల్టింగ్ ఎత్తేశారు. దిగేందుకు హాల్టింగ్ లేదు, ఎక్కేందుకు హాల్టింగ్ ఇవ్వడంపై రైల్వే అధికారుల వింతవైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. –సుబ్బనరసయ్య, జిల్లా అధ్యక్షుడు, సమతా సైనిక్‌దళ్, ఓబులవారిపల్లె

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న డీఈవో, ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటి మాసాపేట ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా 6వ రోజు శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం పింఛన్ల పంపిణీ జరగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: అన్న మయ్య జిల్లాలో ఒకటో తారీఖున వందశాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌డీఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓ, ఎంపీడీఓలు, డీఎల్‌డీఓలు, ఎల్డీఎం తదితర అధికారులతో ఆగస్టు 1న జరగబోయే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 2,22,313 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.94 కోట్ల 34 లక్షల నగదు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై 31వ తేదీ నాటికి నగదు మొత్తాన్ని బ్యాంకుల నుంచి విత్ డ్రా చేసుకోవాలని సూచించారు. అందుబాటులో లేని వారు, ఆసుపత్రులలో చికిత్స తీసుకుంటున్న వారు తప్ప మిగతా 99 శాతం పింఛన్లు పంపిణీ ఒకటో తారీఖునే జరగాలన్నారు. పింఛన్ల పంపిణీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎల్‌డీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న రెండో విడత ఎంపిక జాబితా

వేంపల్లె: ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి రెండో విడత ఎంపిక జాబితాను ఆగస్టు 3వ తేదీన విడుదల చేయనున్నట్లు అడ్మిషన్ల ప్రక్రియ కన్వీనర్ అమరేంద్రకుమార్ సంద్రా తెలిపారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు కొనసాగిన మొదటి విడత కౌన్సెలింగ్‌కు 4 క్యాంపస్‌ల నుంచి మొత్తం 4140 మంది విద్యార్థులను పిలిచామన్నారు. అందులో 3396మంది హాజరై అడ్మిషన్లు పొందారన్నారు. 744 సీట్లు మిగిలాయని, వీటి భర్తీ కోసం రెండో విడత జాబితాను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ఎంపికై హాజరుకాని విద్యార్థులు www.rgukt.in వెబ్ సైట్ ద్వారా రెండో విడత కౌన్సెలింగ్‌కు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మొదటి విడతలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఎవరైనా క్యాంపస్ మార్పు చేసుకోదలచిన వారు సదరు వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. 28వ తేదీ నుంచి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు మాత్రమే వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఆగస్టు 19, 20 తేదీల్లో వారికి కేటాయించిన క్యాంపస్‌లో తరగతులకు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

పోలీసుల విచారణ

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాద ఘటన దర్యాప్తులో భాగంగా విచారించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. శనివారం వేకువ జామున మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, సీటీఎం క్రాస్‌రోడ్ సర్పంచ్ బండపల్లె ఈశ్వరమ్మ భర్త, బండపల్లె అక్కులప్పను డీఎస్పీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి, వ్యక్తిగత ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. తర్వాత విడిచిపెట్టి, అవసరమైతే విచారణకు రావాలని చెప్పి పంపేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, ఎయిడెడ్ మరియు మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆగష్టు 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు కనీసం 15 ఏళ్ల బోధనానుభవం కలిగి ఉండాలని, రాష్ట్ర స్థాయి అవార్డుకు దరఖాస్తు చేయువారు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలన్నారు.

కీచక ఉపాధ్యాయుడు

- విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తన
- పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన


వెంకటేశ్వర్లు


ఉపాధ్యాయుడిని పాఠశాల వద్దకు పిలిపించాలని నిరసన తెలుపుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

లక్కిరెడ్డిపల్లి : అభం శుభం తెలియని చిన్నారులు వారు. చదువు తప్ప మరో ప్రపంచం తెలియని వయసు. పాఠాలు నేర్పించాల్సిన ఓ ఉపాధ్యాయుడు వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడారు. పాఠశాలలు తెరిచినప్పటి నుంచి రోజూ గదిలో అతని చేతిలో నలిగిపోయారు. రోజు రోజుకూ వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం సాయంత్రం తల్లిదండ్రులకు చెప్పుకొని బోరున విలపించారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకురావడంతో బాగోతం బట్టబయలైంది. ఈ సంఘటన లక్కిరెడ్డిపల్లి మండలం రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. తల్లిదండ్రుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తన వద్ద చదువుకుంటున్న వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ముగ్గురి విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం మీడియా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై విద్యార్థులను ఆరా తీయగా.. రోజూ తరగతి గదిలోకి పిలిచి చేతులు వేసి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎదురు తిరిగి మాట్లాడితే బెత్తంతో కొట్టేవాడని రోదించారు. 4, 5 తరగతులకు చెందిన పలువురి విద్యార్థినుల పట్ల ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి దృష్టికి తీసుకువెళ్ల లేదా అని విద్యార్థినులను అడుగగా.. హెచ్ఎంకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు సెలవు సాకుతో పాఠశాలకు డుమ్మాకొట్టి ఉపాధ్యాయ సంఘ నేతలతో చర్చిస్తూ రాయబారాలు నడిపే ప్రయత్నం చేశాడు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆ ఉపాధ్యాయునికి తామే బుద్ధి చెబుతామంటూ పేర్కొంటూ.. అక్కడే నిరసన తెలియజేశారు. ఈ విషయాన్ని లక్కిరెడ్డిపల్లి ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య దృష్టికి తీసుకువెళ్లగా.. వారు తమ కార్యాలయానికే విద్యార్థినులను పిలిపించి విచారణ చేశారు. వారు జరిగిన విషయం చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. అక్కడికి కూడా ఉపాధ్యాయ సంఘ నేతలు చేరుకుని రాజీ చేసేందుకు ప్రయత్నించగా.. విద్యార్థినుల తల్లిదండ్రులు తిరగబడటంతో వెళ్లిపోయారు. తమ పిల్లలకు జరిగిన అన్యాయం మరెక్కడా జరగకుండా ఉండాలంటే ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ చక్రేనాయక్ తెలియజేశారు.

కోదండరామయ్యను దర్శించుకున్న హైకోర్టు జడ్జి


ఆలయ రంగమండపంలో సతీసమేతంగా హైకోర్టు జడ్జి ఆకుల వెంకటశేష సాయి

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి ఆకుల వెంకటశేష సాయి శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అధికార లాంఛనాలతో వారికి స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో అధికారులు సత్కరించి స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదనరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 కోట్ల మసీదు భూమి ఆక్రమణ

- తిరిగి స్వాధీనం చేసుకున్న కొత్త మసీదు జమాత్ సభ్యులు


కురబలకోట కొత్త మసీదు భూ రికార్డులు చూపుతున్న జమాత్ నాయకులు

కురబలకోట : ఏళ్లుగా ఆక్రమణకు గురైన రూ.5 కోట్ల విలువ చేసే మసీదు భూమిని కురబలకోట కొత్త మసీదు జమాత్ నాయకులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. జమాత్, గ్రామస్థుల కథనం మేరకు.. కురబలకోట కొత్త జామియా మసీదుకు అంగళ్లు కొత్త బైపాస్ పక్కన 1734-1, 1750-2 సర్వే నెంబర్లలో 6.66 ఎకరాల భూమి ఉంది. ఇటీవల ఈ భూమిని సర్వే చేయించగా రికార్డులలో ఉన్న భూమి కంటే 80 సెంట్లు తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఇది మరొకరి ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించి కొత్త మసీదు జమాత్ నాయకులు శనివారం వెళ్లి ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులు అడ్డుతగలగా.. ఆధారాలు చూపమనడంతో వెనుదిరిగారు. జమాత్ సభ్యులు భూమికి ఫెన్సింగ్ వేయించారు. దేవుడికి సంబంధించిన భూమికి పాస్‌బుక్ ఇవ్వకుండా తిప్పించుకోవడం తగదని వారు విచారం వ్యక్తం చేశారు.

బయటపడిన బాబు నిజస్వరూపం

- పథకాలు ఎగ్గొట్టడానికే అసెంబ్లీలో డ్రామాలు
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు అర్బన్ : అమలుకాని హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు నిజస్వరూపం అసెంబ్లీలో బయటపడిందని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక గెలిచాక అసెంబ్లీలో డ్రామా మొదలు పెట్టాడని తెలిపారు. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగు సంవత్సరాల పాటు ప్రజలకు వివిధ పథకాలు అందించారని గుర్తుచేసారు. అప్పులపేరు చెప్పి తప్పించుకోవడం సిగ్గు చేటు అన్నారు. తల్లికి వందనం, రైతు భరోసా పథకాలు సకాలంలో అమలు చేయక పోవడంతో ప్రజలె ఎందుకు గెలిపించామా అనే డైలమాలో పడ్డారన్నారు. చంద్రబాబు మాటలకు, చేతలకు పొంతనలేదని తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఆదర్శంగా తీసుకొని పాలించారని తెలిపారు.



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


గాయపడిన రాధమ్మ


గాయపడిన లోకేష్


చికిత్స పొందుతున్న ఎస్.కే.బాషా

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ములకలచెరువు మండలం నాయనవారిపల్లికి చెందిన శంకర్ భార్య రాధమ్మ(37) స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. శనివారం సెక్టార్ సమావేశానికి హాజరై తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తుండగా బురకాయలకోట వద్ద కారు ఢీకొంది. ప్రమాదంలో ఆమె కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

మదనపల్లె పట్టణం రాజానగర్‌లో నివసిస్తున్న తిరుపాల్ కుమారుడు లోకేష్ (21) అమ్మ చెరువు మిట్ట వద్ద ద్విచక్ర వాహనానికి పెట్రోల్ నింపుకొని వస్తున్నారు. లారీని తప్పించబోయి అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి గాయాలు

మదనపల్లె : కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే.బాషాకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. మదనపల్లెలో నివాసం ఉన్న ఎస్.కే.బాషా శనివారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో గుర్రంకొండకు బయలుదేరారు. మార్గమధ్యంలో గుర్రంకొండ టమాటా మార్కెట్ సమీపంలో గాలి వీయడంతో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్ పరామర్శించారు.

కారు ఢీకొని తండ్రి, తనయుడికి గాయాలు

బి.కొత్తకోట : బైక్‌పై వెళ్తున్న తండ్రి, తనయులను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... మండలంలోని గోళ్లపల్లె హైస్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న నాగరాజు(62), తన కుమారుడు పృథ్వీరాజ్(35)ను హైస్కూల్‌లో వదిలేందుకు పెద్దమండెం నుంచి బైక్‌లో బయలుదేరారు. కాండ్లమడుగు క్రాస్ వద్దకు రాగానే కారు ఢీకొంది. దీంతో నాగరాజు, పృథ్వీరాజ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన నాగరాజు, పృథ్వీరాజ్

చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్ల దాడి


చికిత్స పొందుతున్న శివసుమన్ కుమార్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల మార్కెట్ యార్డు సమీపంలోని ఒక హోటల్ వద్ద చీనీ వ్యాపారిపై తెలుగు తమ్ముళ్లు దాడి చేసిన సంఘటన శని వారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెకు చెందిన శివసుమన్‌కుమార్‌రెడ్డి శనివారం తాను పండించిన చీనీ కాయలను పులివెందుల మార్కెట్‌యార్డులోని మండీలో విక్రయించేందుకు వచ్చాడు. చీనీ కాయలు విక్రయించిన తర్వాత శనివారం మధ్యాహ్నం స్థానిక హోటల్‌కు భోజనానికి వెళ్లాడు. ఆర్డర్ ఇచ్చిన కొద్ది నిముషాలలోనే మూడు సార్లు కరెంటు పోయింది. దీంతో శివసుమన్ కుమార్‌రెడ్డి పక్కన ఉన్న వారితో తెలుగుదేశం ప్రభుత్వంలో కరెంటు కోతల కష్టాలుంటాయని పేర్కొన్నాడు.. ఇంతలో అక్కడే ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు మా పార్టీని, మా నాయకులను విమర్శిస్తావా.. అంటూ శివసుమన్‌కుమార్‌రెడ్డిపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

రామాపురం : మండలంలోని కల్పనాయిని చెరువు పంచాయతీకి చెందిన చరసాల దిలీప్ కులం పేరుతో దూషించాడని గాలంగుండ్లపల్లె హరిజనవాడకు చెందిన కాసిపోగుల సోనియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్‌వీ.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కల్పనాయినిచెరువు పంచాయితీ గాండ్లగుండ్లపల్లి హరిజనవాడకు చెందిన సోనియా అడపలమాలపల్లె చర్చిలో జరిగే ఉత్సవాలకు పిల్లలు, పెద్దలను తీసుకెళ్లేందుకు వ్యాన్ తీసుకు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన చరసాల దిలీప్ సైకిల్ మోటార్‌పై వెళ్లి వ్యాన్‌ను అడ్డగించారని, అందరినీ ఎక్కడికి తీసుకెళ్తున్నారని సోనియాను ప్రశ్నించినట్లు తెలిపారు. మహిళలను కడపలమాలపల్లి చర్చికి తీసుకెళ్తున్నానని చెప్పగా.. మత మార్పిడి చేసేందుకు వెళ్తున్నావంటూ నిలదీసి దిలీప్ తనను కులం పేరుతో దూషించాడని సోనియా ఫిర్యాదులో పేర్కొన్నా రు. ఈ మేరకు దిలీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యా, భర్తల మధ్య గొడవ.. అత్తను హతమార్చిన అల్లుడు


మృతి చెందిన నీలావతి

కేవీపల్లె : భార్యాభర్తల మధ్య గొడవ వద్దని నచ్చజెప్పిన అత్తను అల్లుడు హత్య చేసిన సంఘటన అన్నమయ్య జిల్లా వగళ్ల పంచాయతీ నారమాకులపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నారమాకులపల్లెకు చెందిన నీలావతి (50) కుమార్తె రెడ్డి సుధకు పదిహేనేళ్ల కిందట చిత్తూరు టౌన్‌కు చెందిన విజయకుమార్‌తో వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం రెడ్డి సుధ పుట్టింటికి వచ్చింది. విజయకుమార్ శుక్రవారం రాత్రి నారమాకులపల్లె అత్తగారింటికి చేరుకుని రెడ్డి సుధను కాపురానికి రావాలని తన భార్య, అత్తతో గొడవపడ్డాడు. అనంతరం అందరూ నిద్రించారు. శనివారం ఉదయం నిద్ర లేచిన అనంతరం నీలావతి ఇంటి బయట ఉండగా విజయకుమార్ ఒక్కసారిగా కర్రతో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కలకడ సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజా ఫౌండేషన్ ఆస్తులపై విచారణ జరిపించండి

ప్రొద్దుటూరు : రాజా ఫౌండేషన్‌కు సంబంధించిన ఆస్తుల, ఆదాయ వివరాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ కమిటీని నియమించాలని ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు వైసీ నారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం వారు డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ రాజారెడ్డి హత్య అనంతరం ఫౌండేషన్‌ను ఏ విధంగా శ్రీత్రిదండి చిన్నజీయర్ స్వామి ట్రస్టుకు మార్పు చేశారని, ప్రస్తుతం ట్రస్టులోని సభ్యులను ఏ అర్హతలతో నియమించారని ప్రశ్నించారు. ఎంతో మంది అభాగ్యులు, అనాథల కోసం రాజారెడ్డి ఉన్నత ఆశయంతో 2002లో రాజా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.

ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్: పూజా స్కూల్, డాడీహోంను ప్రభుత్వం నిర్వహించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ నాయకులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ డాడీహోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి మరణానంతరం పూజా స్కూల్, డాడీహోం ఆస్తులను కబ్జా చేసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించి, ఆసరా నిలుస్తున్న పూజా ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, లింగమయ్య పాల్గొన్నారు.

ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

సిద్దవటం : ద్విచక్ర వాహనాదారులు, పిలియన్ డ్రైవర్‌లకు శనివారం ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసినట్లు డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలోని హెచ్‌పీసీఎల్ నందు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచన మేరకు వాహనదారులకు హెల్మెట్ల ధారణపై సదస్సు నిర్వహించామన్నారు. అనంతరం హెచ్‌పీసీఎల్, భాకరాపేట ప్రధాన బస్టాపులో ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ సతీష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.ఓబయ్య, హెచ్‌పీసీఎల్ అధికారులు, కార్మికులు మహిళలు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


హెల్మెట్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ కృష్ణమూర్తి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కుందా నెల్లూరు గ్రామ మహిళలు

నందలూరు : మండలంలోని కుందా నెల్లూరు గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని విలేకరుల స్థానిక మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కుందా నెల్లూరు పంచాయతీని నూకినేనిపల్లిలో విలీనం చేసినప్పటి నుంచి తమకు తాగునీరు కరవైందన్నారు. గతంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా వద్ద తమ సమస్యను విన్నవించుకోగా డిస్ట్రిక్ మైనింగ్ ఫండ్(డీఎంఎఫ్) గ్రాండ్ క్రింద రూ.12 లక్షలు మంజూరు చేశారన్నారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు రూ.7.58 లక్షలు ఖర్చు చేసి బోరు, మీటరు ఏర్పాటుచేసి.. పైపులైన్ వేశారని తెలిపారు. విద్యుత్తు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.2.50 లక్షల నిధులు కావాలని కోరగా.. డీఎంఎఫ్ అధికారులు జాప్యం చేయడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో తాము దాదాపు రెండు కిలో మీటర్ల దూర ంనుంచి మోటార్ల వద్ద నీరు తెచ్చుకొని తాగుతున్నామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్, డీఎంఎఫ్ అధికారులు తమపై దయ యుంచి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

అరచేతిలో...గోరింట అందాలు!

- ఏటా ఆషాడంలో వస్తున్న సంప్రదాయం



మదనపల్లె సిటీ : అతివ..అషాడం..గోరింటాకుకు అవినాభావ సంబంధం ఉంది. ఏటా అషాడ మాసంలో ఏదో రోజు మహిళలు గోరింటాకు పెట్టుకుంటే మంచిదని అందరూ భావిస్తుంటారు. ఇదే సంప్రదాయం మహిళలు ఏటా ఆచరిస్తారు. అందానికే కాదు.. ఇది ఔషధ గుణాలు దాగి ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. పండగ, వేడుకలు, శుభకార్యాలతోపాటు ఆషాడ మాసం వచ్చిందంటే చాలు అతివలు గోరింటాకు పెట్టుకునేందుకు ఇష్టపడుతుంటారు. కొత్త కోడళ్లు అత్తింటి నుంచి పుట్టింటికి వెళ్లినా గోరింటాకు పెట్టుకోవాలనే పూర్వీకుల సంప్రదాయం కొనసాగిస్తూనే ఉండడం విశేషం.

గోరింటా తయారీ ఇలా..

గోరింటాకులో చింతపండు, పెరుగు, పంచదార వేసి బాగా రుబ్బాలి. దాంట్లో కొద్దిగా నిమ్మరసం వేస్తే మరింత నాణ్యతగా తయారవుతోంది. గోరింటాకుగానీ పొడి గానీ రాత్రంతా నీళ్లలో నానబెడితే మంచి రంగులో గోరింట పండుతుంది.

గోరింటాకు ప్రయోజనాలెన్నో..

ఆషాడం సీజన్‌లో శరీరంలోని వేడి బయటకు వెళ్లి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గోరింటాకు పెట్టుకుంటే రోగనిరోధకశక్తి పెరిగి, వేడి బయటకు పోకుండా అలాగే ఉంటుంది. అందుకే ఆషాడంలో గోరింటాకు పెట్టుకోవాలనే ఆచారం మొదలైంది. పైత్యం, చర్మవ్యాధులకు సంబంధించిన సమస్యలను గోరింటాకు నయం చేస్తుంది. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధులు రావు.

సంప్రదాయాలను మరువకూడదు



పూర్వీకులు ఆచరించే సంప్రదాయాలను మరువకూడదు. వారు అవలంభించిన సంప్రదాయలు పాటిస్తే మనకు తెలియకుండా ఎంతో మేలు జరుగుతుంది. మహిళలు, యువతులు, చిన్నారులు గోరింటాకు పెట్టుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో ఆరోగ్యం,అందమే తప్ప నష్టమేమీ లేదు.

- మోహన్‌వల్లి, అధ్యాపకురాలు, మదనపల్లె

ఆచార వ్యవహారాలు తెలియజేయాలి



మన ఆచార వ్యవహారాలను పిల్లలు తెలియజేయాలి. ఆషాడంలో గోరింటాకు పెట్టుకుంటే మంచిదనే ఆచారం ఎప్పటినుంచో ఉంది. ఇది పిల్లలకు ఎప్పటికప్పుడు తెలియజేయడం ద్వారా వారి ఆరోగ్యం కాపాడిన వారమవుతాం. ఇప్పుడు కోన్‌లు ఎన్ని ఉన్నా గోరింటాకుకు సాటిరావు.

- రేణుక(చిట్టి), సొసైటీ కాలనీ, మదనపల్లె